సాక్షి
నంద్యాల
ఆదివారం । 2 । జూలై । 2023



ఘనంగా వైద్యుల దినోత్సవం

కర్నూలు (హాస్పిటల్): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో శనివారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు సన్మానం చేశారు.



పలుచోట్ల వర్షం

ఆలూరు రూరల్: జిల్లాలో శనివారం పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో పంటలు సాగు చేసిన రైతులకు ఉపశమనం లభించింది. సాగులో ఉన్న పత్తి, వేరుశనగ పైర్లు ఊపిరి పోసుకున్నాయి.



చిరుతల సంచారం

కోసిగి మండల పరిధిలోని తిమ్మప్ప కొండ, బస గౌడగల్లు, చిర్తనకల్లు, దుద్ది, గ్రామాల పరిసరాల్లో చిరుత పులులు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజల భయాందోళన చెందుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు శ్రీశైల భ్రామరికి శాకాంబరీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థం ఆషాడపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి శాకాంబరీ ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో అమ్మవారి మూలమూర్తిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల ఫలాలతో విశేషంగా అలంకరించనున్నారు. ఆలయ ప్రాంగణాన్ని కూడా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలతో అలంకరిస్తారు. ఉత్సవంలో భాగంగానే ఆలయప్రాంగణంలోని రాజరాజేశ్వరిదేవి, సప్తమాతృకులకు, గ్రామ దేవత అంకాలమ్మకు ప్రత్యేక పూజలు, విశేషంగా శాకాలంకరణ చేస్తారు. ఈ విధంగా అమ్మవారిని శాకలతో అర్చించడంతో అతివృష్టి, అనావృష్టి నివారించబడి సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండుతాయని పురాణాలు చెబుతున్నాయి.

డెంగీపై అవగాహన మాసోత్సవాలు ప్రారంభం

నంద్యాలటౌన్: ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు డెంగీ వ్యాధిపై అవగాహన మాసోత్సవాలు ప్రారంభించామని జిల్లా మలేరియా, డెంగీ నివారణ అధికారి కామేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో మలేరియా మాసోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన స్పూర్తితో డెంగీ మాసోత్సవాలు చేపడుతున్నామన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఫ్రైడే డ్రైడే నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, డెంగీ వ్యాధి గురించి అవగాహన కల్పిస్తారన్నారు. ఎవరైనా డెంగీ, మలేరియా లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వారికి తగిన పరీక్షలు నిర్వహించి మెరుగైన మందులు అందిస్తామన్నారు.

108 మంది గైర్హాజర్

నంద్యాల(న్యూటౌన్): ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 108 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శనివారం ఆరు కేంద్రాల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పదో తరగతిలో 291 మంది విద్యార్థులకు గాను 241 మంది (83 శాతం) హాజరు కాగా 50 మంది గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్‌లో 407 మంది విద్యార్థులకు గాను 349 మంది హాజరు కాగా 58 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీ చేసిందన్నారు.

తెలుగువర్సిటీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠం శ్రీశైలం ప్రాంగణంలో 2023–24 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ, ఎంఏ హిస్టరీ, ఆర్కియాలజీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఠాధిపతి మునుగు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జూన్ 16వ తేదీతో గడువు ముగిసినప్పటికీ అపరాధ రుసుంతో ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. పీహెచ్‌డీలో 9, ఎంఏలో 40 సీట్లు ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం 9441370591, 9989240806ను సంప్రదించాలన్నారు.

లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లు



టిడ్కో గృహాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి

ఆళ్లగడ్డ: టిడ్కో ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణ శివారులోని టిడ్కో గృహ సముదాయాలను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నివాస యోగ్యానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి గృహ ప్రవేశాలు చేసే బృహత్తర కార్యక్రమాన్ని త్వరలో చేపడుతామని చెప్పారు. మౌలిక వసతుల పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.

సంక్షేమ ధ్రువీకరుణ

పింఛన్ కావాలనో.. 'చేయూత' ఇవ్వాలనో..
'ఆసరా' కోసమో.. 'భరోసా' కల్పించాలనో.. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.. అర్జీలు ఇవ్వాల్సిన పని కూడా తప్పింది.. ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి సమస్య తెలుసుకుంటారు. దరఖాస్తు పూర్తి చేసి, సచివాలయాల్లో అందజేసి, ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటే లబ్ధిదారుగా చేరుస్తారు. అంతే కాకుండా పైసా ఖర్చు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తారు. ప్రజల కోసం రాష్ట్రప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో శనివారం ప్రారంభమైంది. మొదటి రోజు విశేష స్పందన లభించింది. ఉచితంగా సర్టిఫికెట్లు అందుకున్న, సంక్షేమ పథకాలకు అర్హత సాధించిన వారిలో సంతోషం వెల్లివిరిసింది.

- జిల్లాలో ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం
- పైసా ఖర్చు లేకుండా సంక్షేమ పథకాల వర్తింపు, సర్టిఫికెట్ల జారీ
- మొదటిరోజు 41 సచివాలయాల పరిధిలో 12,390 మందికి సేవలు



నంద్యాలలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా తదితరులు

నంద్యాల: కుల ధ్రువీకరణ పత్రం అందుకున్న విద్యార్థి.. రేషన్ కార్డు తీసుకున్న ఇంటి పెద్ద.. ఇల్లు మంజూరు పత్రాన్ని పొందిన మహిళ.. పంట నష్ట పరిహారానికి అర్హత సాధించిన రైతు.. వాహన మిత్ర పథకంలో లబ్ధిదారునిగా చేరిన డ్రైవరు..ఇలా ఒకరేమిటి.. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ సేవలు ఉచితంగా అందడంతో హర్షం వ్యక్తం చేశారు. ఎక్కడికీ వెళ్లకుండా.. ఎవరి సిఫార్సులు లేకుండా.. పైసా ఖర్చు లేకుండా అవసరమైన పత్రాలు అందించేందుకు, అర్హత ఉండి ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండేవారిని లబ్ధిదారులుగా చేర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం శనివారం లాంఛనంగా ప్రారంభించింది.

నంద్యాల జిల్లాలో మొదటి రోజు 41 సచివాలయాల పరిధిలో ధ్రువపత్రాలు అందజేసే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు సచివాలయ పరిధిలో సమావేశం నిర్వహించి ప్రజలు అందించిన దరఖాస్తులను పరిష్కరించి అక్కడికక్కడే ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. జిల్లాలో 16,207 మంది 11 రకాల ధ్రువపత్రాల కోసం టోకెన్లు అందజేయగా వాటిలో 14,170 టోకెన్లను అధికారులు పరిశీలించి 12,390 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. 1,780 టోకెన్లు ఇచ్చినా ధ్రువపత్రాలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఈ టోకెన్లకు సంబంధించిన సర్వీసులు చేయలేదు. 74 టోకెన్లను అధికారులు తిరస్కరించారు.

నియోజకవర్గాల్లో ఇలా..

➢ ఆళ్లగడ్డ నియోజకవర్గం ఉయ్యాలవాడ మండలంలోని తుడుములదిన్నె గ్రామంలో, శిరివెళ్ల మండలంలోని మహదేవపురం, దొర్నిపాడు మండలంలోని గుండుపాపల, చాగలమర్రి, ఆళ్లగడ్డ పట్టణంలోని 9వ సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొని ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారు.

➢ శ్రీశైలం నియోజకవర్గంలో ఆత్మకూరు, వెలుగోడు మండలంలోని అర్జునాపురం, మహానంది మండలంలో బొల్లవరం, బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పాల్గొని ప్రజలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. పేదలకు సచివాలయ పరిధిలోనే ధ్రువపత్రాలు అందజేస్తుండటం సంతోషంగా ఉందన్నారు.

➢ నందికొట్కూరు నియోజకవర్గంలో కొత్తపల్లి మండలంలో దుద్యాల గ్రామంలో, పాములపాడు మండలం మద్దూరులో, జూపాడుబంగ్లా మండలం తర్తూరులో, నందికొట్కూరు 2వ సచివాలయంలో, పగిడ్యాల, మిడుతూరు మండల కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

➢ బనగానపల్లె నియోజకవర్గంలోని సంజామల మండల కేంద్రంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లె గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల వద్దకే పరిపాలనను తీసుకువచ్చి, అధికార యంత్రాంగాన్ని సామాన్యుల వద్దకు చేర్చి వారి కష్టాలను సీఎం జగన్ తీరుస్తారన్నారు.

➢ పాణ్యం నియోజకవర్గంలో పాణ్యం, గడివేముల మండల కేంద్రాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పాణ్యంలో జరిగిన సమావేశంలో ఎంపీపీ హుసేన్‌బీ, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, గడివేము సమావేశంలో జెడ్పీటీసీ చంద్రశేఖర్‌లు ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారు.

➢ డోన్ నియోజకవర్గంలో ప్యాపిలిలోని 1, 2 సచివాలయాలు, బేతంచెర్లలోని 1, 2 సచివాలయాలు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఆనందంగా ఉంది



రంగారెడ్డి జిల్లా మామిడిపల్లె గ్రామానికి చెందిన ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌తో నాకు జూన్ నెల 22న వివాహం జరిగింది. మ్యారేజ్ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. వారం రోజుల్లోనే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతుల మీదుగా వివాహ ధ్రువీకరణ పత్రం అందించారు. గతంలో ఇలాంటి సర్టిఫికెట్లు కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. మాకు ఎంతో ఆనందంగా ఉంది.
– జయమ్మ, ఏ.కోడూరు బండిఆత్మకూరు

ఆందోళన తొలగించారు



పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు వెళ్తే కులం, ఆదాయం సర్టిఫికెట్లు తీసుకు రమ్మన్నారు. దరఖాస్తు చేసుకుంటే ఆదాయం సర్టిఫికెట్ ఇస్తామని, కులం సర్టిఫికెట్‌కు విచారణ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందుకు ఎన్ని రోజులు పడుతుందోనని ఆందోళన చెందాం. ఇంతలో వలంటీర్ ఇంటి దగ్గరకు వచ్చి ఆధార్ కార్డు తీసుకెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కులం ధ్రువపత్రానికి దరఖాస్తు చేశాడు. ఈ రోజు నాకు ఉచితంగా కులం, ఆదాయం ధ్రువ పత్రాలు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మాకు ఎంతో మేలు జరుగుతుండటమే కాకుండా ఆందోళనను తొలగించారు.
– లక్ష్మీనరసమ్మ, అహోబిలం

నియోజకవర్గాల వారీగా అందించిన సేవల వివరాలు..

నియోజకవర్గం	టోకెన్ల సంఖ్య	పరిష్కారానికి పంపినవి	అందజేసిన సేవలు
నంద్యాల	2,376	1,997	1,827
ఆళ్లగడ్డ	2,518	2,196	2,052
బనగానపల్లె	2,333	2,003	1,887
డోన్	2,423	2,069	1,798
నందికొట్కూరు	3,677	3,335	2,435
పాణ్యం	1,283	1,202	1,151
శ్రీశైలం	1,597	1368	1,240
మొత్తం	16,207	14,170	12,390

సామాన్యుల గుండెల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

నంద్యాల(సిటీ): గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. నంద్యాల పట్టణంలో శనివారం 21వ వార్డు హరిజనవాడలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా మట్లాడుతూ పట్టణంలో అర్హత ఉండి ఇంకా ఏవైనా పథకాలు పొందలేని వారిని అధికారులు సర్వే నిర్వహించి గుర్తిస్తున్నారన్నారు. అనంతరం వార్డు పరిధిలో సుమారుగా 700 మందికి ఎటువంటి రుసుం లేకుండా ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, వార్డు ఇన్‌చార్జ్ అనిల్ అమృతరాజ్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వేణుగోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యాభై ఏళ్లుగా వారు డోన్‌కేమీ చేయలేదు





మునిసిపల్ పరిపాలన భవన ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, బుగ్గన, ఎంపీ పోచా తదితరులు, సభకు హాజరైన జనం

- జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు
- పేదలను నిరుపేదలుగా మార్చిన ఘనత చంద్రబాబుది
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: డోన్ నియోజకవర్గం నుంచి గత 50 ఏళ్లుగా ప్రాతినిథ్యం వహించి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, తదితర పదవులను అలంకరించిన కోట్ల, కేఈ కుటుంబీకులు డోన్‌కు రెవెన్యూ డివిజన్, సబ్‌కోర్టు సాధించలేకపోయారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం డోన్ పట్టణంలోని రైల్వే గేట్ల వద్ద రూ.12 కోట్లతో నిర్మించ తలపెట్టిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జికి భూమి పూజ, రూ.6 కోట్లతో నిర్మించిన మునిసిపల్ పరిపాలన భవనం ప్రారంభోత్సవానికి మంత్రి బుగ్గనతో పాటు మునిసిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెటిస్తున్నారన్నారు. సీఎం జగన్ గొప్ప దార్శనికుడు, పరిపాలనాధ్యక్షుడు కావడంతో నిరుపేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధిని కాంక్షిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు పేదలను మరింత పేదలుగా మార్చేందుకు కులవృత్తుల కింద సుత్తి, కొడవలి, ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేసి ప్రజలను మభ్యపెట్టారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశామన్నారు. మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు దినేష్‌గౌడ్, మల్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పచ్చ పత్రికకు మంత్రి చురక

ఇటీవలే ఒక దిన పత్రిక ప్రచురించిన కార్టూన్‌పై మంత్రి మండిపడ్డారు. ఒక రోడ్డుకు తన పేరు పెట్టడంతో పచ్చ పత్రికలు రాద్ధాంతం చేయడం తగదన్నారు. గతంలో డోన్ పట్టణంలో వెలసిన కాలనీలకు, కూరగాయల మార్కెట్‌కు కొందరు స్థానిక నాయకుల పేర్లు పెట్టారని, వాటిని ఎవరి సొమ్ముతో కట్టారని చురకలంటించారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు
– మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పచ్చ పత్రికలు, విపక్ష పార్టీలు అబద్ధపు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకొని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. సీఎంకు మంత్రి బుగ్గన కుడిభుజంగా ఉంటూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకువెళ్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ.6 కోట్లతో మునిసిపల్ పరిపాలన భవనాన్ని నిర్మించడం అభినందించదగ్గ విషయమన్నారు.

పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధి
– ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో మధ్యతరగతి, నిరుపేద ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకొని సగౌరవంగా జీవిస్తున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. విపక్షాలు తమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు చేస్తున్నాయని, ప్రజలే తిప్పి కొట్టాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీకి తిరిగి పట్టం కడితే ప్రజల ఆర్థిక స్థితిగతులు మరింత మెరుగుపరిచేందుకు వీలవుతుందన్నారు.

ఆనందమని'పింఛన్'


- తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ



నంద్యాలలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు

నంద్యాల(న్యూటౌన్): తెల్లవారకముందే పింఛన్ పిలుపు తలుపు తట్టడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మురిసి పోయారు. 1వ తేదీనే ఠంఛన్‌గా పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను కొనియాడారు. జిల్లాలో 2,14,259 మంది పింఛన్ దారులకు జూలై నెలకు సంబంధించి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీకి రూ.59.13 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం తెల్లవారుజాము నుంచే జిల్లాలో లబ్ధిదారులందరికీ గ్రామ, వార్డు వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు. సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 88 శాతం పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

నేడు రైతుబజార్లలో సబ్సిడీ టమాట పంపిణీ



కర్నూలు(అగ్రికల్చర్): టమాట ధరలు పెరిగిన నేపథ్యంలో వినియోగదారులకు ఊరట కలిగిస్తూ ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ.50 ప్రకారం పంపిణీ చేస్తోంది. ఇది వరకే సబ్సిడీపై 7 టన్నుల టమాటను వినియోగదారులకు కర్నూలు నగరంలోని మూడు రైతుబజార్ల ద్వారా పంపిణీ చేసింది. తాజాగా ఆదివారం సబ్సిడీపై ఆరు టన్నుల టమాట పంపిణీకి ఏర్పాట్లు చేపట్టారు. మదనపల్లిలో కొనుగోలు చేసిన టమాట 2వ తేదీ ఉదయం కర్నూలుకు వస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తెలిపారు. శనివారం రైతుబజారులో కిలో టమాట ధర రూ.96 ఉండగా.. బయట రూ.120 వరకు విక్రయిస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం సబ్సిడీపై టమాట పంపిణీ చేస్తుండటం వినియోగదారులకు ఊరట కలిగిస్తోంది.

అహోబిలంలో శాస్త్రోక్తంగా జ్యేష్టాభిషేకం



ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ: అహోబిలం పుణ్యక్షేత్రంలో జ్యేష్టాభిషేక వేడుకలు పీఠాధిపతి యతీంద్రికన్ మహాదేశికన్ ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగాయి. శనివారం దిగువ అహోబిలంలో వెలసిన శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం ప్రధాన ద్వారం ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదుడిని కొలువుంచి ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, వేద పండితలు వేదమంత్రాల మధ్య నవకళశస్థాపన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్లుప్తంగా

నేడు ఐఎంఏ భవనం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జి.రవికృష్ణ

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్మించిన నూతన భవనాన్ని ఈ నెల 2న ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి.రమేష్ తెలిపారు. స్థానిక డాక్టర్స్ కాలనీలోని ఐఎంఏ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాయంత్రం 6 గంటలకు నూతన భవనాన్ని సీనియర్ యురాలజిస్టు డాక్టర్ ఏవీఎస్ రెడ్డి, టీజీవీ గ్రూపుల ఛైర్మన్ టిజి. వెంకటేష్ ప్రారంభిస్తారన్నారు. అనంతరం డాక్టర్ బీసీ రాయ్ విగ్రహాన్ని పద్మ భూషణ్, ఏఐజీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి ఆవిష్కరిస్తారన్నారు.

అంబేద్కర్ గురుకులాల్లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం(ఎంపీసీ/బైపీసీ/ఎంఈసీ/హెచ్ఈసీ/సీఈసీ) గ్రూపుల్లో మిగిలిన సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ జిల్లా కోఆర్డినేటర్ డి.రామసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 4న చిన్నటేకూరు కళాశాలలో బాలురకు, దిన్నెదేవరపాడు పాఠశాల/కళాశాలలో 5వ తేదిన బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. బీఆర్ఏజీసీఈటీ ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా 10వ తరగతి రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. ఫోన్ సమాచారం అందిన విద్యార్థులు మాత్రమే ఆధార్, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల నకలుతో పాటు ప్రవేశ పరీక్ష మెరిట్ కార్డుతో హాజరుకావాలన్నారు.

ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల పునఃప్రారంభం

కర్నూలు కల్చరల్: వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో తరగతులు పునః ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. గాత్రం, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, కూచిపూడి నృత్య విభాగాల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. జులై 1, 2023 నాటికి 10 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలన్నారు. కళాశాలలో నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారు 2 సంవత్సరాల డిప్లమా కోర్సుకు అర్హులన్నారు. విద్యార్థులు, గృహిణిలు, ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉండేలా ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పొదుపు మహిళల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం మహిళల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ తెలిపారు. కర్నూలుకు వచ్చిన ఆయన శనివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు.

- కర్నూలు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన 35 మంది పొదుపు మహిళలు ఉమన్ ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీగా ఏర్పాటయ్యారు. ఈ సొసైటీకి మత్స్యశాఖ ద్వారా ఫిష్ కియోస్క్ యూనిట్ మంజూరైంది. ఈ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ జి.సృజనతో కలిసి సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ శ్యామల పాల్గొన్నారు.
- కల్లూరు మండలం తనకడపల్లిలో 23 మంది పొదుపు మహిళలకు విజిటబుల్ సోలార్ డ్రయర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీ ఉమాదేవి పాల్గొన్నారు.
- ఎమ్మిగనూరు మండలం బనవాసిలో మత్స్యశాఖ ద్వారా పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను ప్రారంభించారు. అక్కడే పొదుపు మహిళలకు నాటుకోళ్ల యూనిట్‌లు, స్త్రీ నిధి కింద గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు.
- ఆస్పరిలో ఉద్యాన శాఖ ద్వారా పొదుపు మహిళలు రైతు ఉత్పత్తిదారులకు సంఘం నెలకొల్పిన ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ మాట్లాడుతూ పొదుపు మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో స్త్రీ నిధి ఎండీ నాంచారయ్య, డీజీఎం కేశవ్‌కుమార్, డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, అడిషనల్ పీడీ శ్రీధర్‌రావు, డీఆర్‌డీఏ అదనపు పీడీ షరీఫ్, డీపీఎంలు నరసమ్మ, రెహిమాన్ తదితరులు పాల్గొన్నారు.



సుంకేసుల గ్రామంలో ఫిష్ కియోస్క్‌ను కలెక్టర్ సృజనతో కలసి ప్రారంభిస్తున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

జిల్లా ట్రెజరీకి 15 మంది సిబ్బంది కేటాయింపు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా ఖజానా కార్యాలయానికి 15 మంది సిబ్బందిని కేటాయిస్తూ రాష్ట్ర ఖజాన శాఖ డైరెక్టర్ మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. పనిభారం పెరిగినే నేపథ్యంలో కొద్ది నెలల క్రితం జిల్లా ట్రెజరీలో సీనియర్ అకౌంటెంటుగా పని చేస్తున్న సాంబశివారెడ్డి సిబ్బంది కేటాయింపుల్లో కర్నూలు జిల్లాకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని, నంద్యాల జిల్లా ట్రెజరీ నుంచి కర్నూలు జిల్లా ట్రెజరీకి అదనంగా సిబ్బందిని కేటాయించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. దీంతో ఖజాన శాఖ సిబ్బంది కేటాయింపు ఎలా జరిగిందనే దానిపై దృష్టి సారించింది. మండలాల ప్రాతిపదికన కాకుండా డీడీవోల ప్రాతిపదికన సిబ్బందిని కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా జిల్లా ట్రెజరీకి 15 పోస్టులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నంద్యాల జిల్లా ట్రెజరీ నుంచి ఎస్‌టీవోలు టి.వెంకటరమణ, ఎం.మహేష్, 6గురు సీనియర్ అకౌంటెంట్లు, 5గురు జూనియర్ అకౌంటెంట్లు, ఒక ఆఫీస్ సబార్డినేట్‌ని అలాట్ చేశారు. జూనియర్ అకౌంటెంటు పోస్టుల్లో 4 ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా నంద్యాల జిల్లా నుంచి 14 పోస్టులు కర్నూలు జిల్లా ట్రెజరీకి వచ్చాయి.



జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావుకు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న ఏటీఓ సుబ్బరాయుడు

అనంతపురం జిల్లా నుంచి ఏటీఓ కేటాయింపు

జిల్లా విభజన తర్వాత కర్నూలు జిల్లా ట్రెజరీలో అసిస్టెంటు ట్రెజరీ పోస్టు లేకుండా పోయింది. దీంతో ఈ ట్రెజరీకి ఒక ఏటీవోను కేటాయించారు. అనంతపురం జిల్లా ట్రెజరీలో ఏటీవోగా పనిచేస్తున్న సుబ్బరాయుడును కర్నూలు ట్రెజరీకి మార్పు చేశారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావుకు జాయినింగ్ రిపోర్టు ఇచ్చి బాధ్యతలు కూడ స్వీకరించారు.

జిల్లా చరిత్ర, సంస్కృతిని తెలుసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లా చరిత్ర, సంస్కృతిని నేటి యువత తెలుసుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లాగా అవతరించి 165 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాకతీయ పాఠశాలలోని తెలుగు తోటలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు జిల్లా మేధావుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షత వహించగా, రిటైర్డ్ ప్రొఫెసర్ మన్సూర్ రహమాన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను సంరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు జిల్లా చరిత్ర విశిష్టమైనదని, నేటి యువతకు తెలియజేసేందుకు పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు, సమావేశాలు, వ్యాస, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని నిర్ణయించారు. త్వరలోనే జిల్లాలోని చారిత్రక ప్రదేశాలు, కట్టడాలను తెలియజేసేందుకు కర్నూలులో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేసినట్లు చెప్పారు. కర్నూలు జిల్లాకు సంబంధించి స్వాతంత్ర్య ఉద్యమం, సాహిత్యం, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక, సామాజిక అంశాలపై 165 రచనలతో ఒక సంపుటిని రూపొందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలుగు భాషా వికాసం సంఘం అధ్యక్షుడు జేఎస్ఆర్‌శర్మ, విశ్రాంత జాయింట్ డైరెక్టర్‌చంద్రశేఖర్, చరిత్రకారుడు ఇమ్మాన్యుయేల్, ప్రముఖ రచయితలు ఎం.ఇనయాతుల్లా, అజీజ్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.5,367 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు (న్యూసిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రోడ్ల నిర్మాణానికి రూ.5,367.85 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్ పరిధిలోని 30.8 కి.మీ. రోడ్ల నిర్మాణానికి రూ.27.85 కోట్లు, ఆదోని డివిజన్‌లో 75 కి.మీ.కు రూ. 2,840 కోట్లు, నంద్యాల జిల్లాలో 42.975 కి.మీ.కు రూ. 2,500 కోట్ల ప్రకారం ప్రణాళికను తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆమోద ముద్ర లభించిన వెంటనే 148.775 కి.మీ మేర రోడ్ల నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ చేపడతామని తెలిపారు.



ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు

బైక్ సీట్లలో కర్ణాటక మద్యం సరఫరా

- ఇద్దరు నిందితుల అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: అక్రమార్కులు కర్ణాటక మద్యం రవాణాకు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా బైక్ సీట్లలో దాచి గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. వీరి అక్రమాలను సెబ్ పోలీసులు రట్టు చేశారు. శనివారం సెబ్ కార్యాలయ ఆవరణలో ఎస్ఐ సోమశేఖర్‌రావు వివరాలు వెల్లడించారు. నాగలదిన్నె బ్రిడ్జి దగ్గర రెండు బైక్‌లను సోదా చేయగా సీట్లలో మద్యం ప్యాకెట్లు కనిపించాయన్నారు. సీట్లో టెట్రా ప్యాకెట్లను ఉంచి, ప్యాక్ చేసి అనుమానం రాకుండా మద్యం తరలిస్తున్నారన్నారు. రెండు బైక్ సీట్ల నుంచి 384 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, మద్యం తరలిస్తున్న కె.తిమ్మాపురం గ్రామానికి చెందిన నల్లబోతుల రంగన్న, బోయ రంగస్వాములను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు. కర్ణాటక మద్యం తరలిస్తున్నా, విక్రయిస్తున్నా.. 9440902579 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. హెడ్‌కానిస్టేబుళ్లు గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, రామచంద్రుడు, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ పోలీసులు

చిరుతల సంచారం..భయాందోళనలో ప్రజలు

కోసిగి: మండల పరిధిలోని తిమ్మప్ప కొండ, బసవన్న కొండ, గొడగల్లు, చిర్తనకల్లు, దుద్ది, గ్రామాల పరిసరాల్లో చిరుత పులులు సంచరిస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రిల్లో కోసిగిలోని బసవన్న కొండ సమీపంలో రెండు చిరుతలు... పరసాని నాగరాజు పొలంలో నిలిపిన గొర్రెల మందపై దాడి చేశాయి. ఒక మేకను పట్టుకుని పరుగులు తీస్తుండగా అక్కడే నిద్రిస్తున్న నాగరాజుతో పాటు గొర్రెల కాపరులు అరుపులు వేయడంతో మృతి చెందిన మేకను వదిలేసి వెళ్లాయి. తల్లి మృతి చెందిన విషయం తెలియక కళేబరం వద్దకు వెళ్లి పిల్ల మేక పాలు తాగేందుకు యత్నించింది. ఈ దృశ్యం పలువురిని కలచివేసింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనురాధకు ఫోన్ చేయగా.. మృతి చెందిన మేకకు పోస్టుమార్టం చేసి నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, చిరుతలకు హాని కలిగించవద్దని సూచించారు.



చిరుత దాడిలో మృతి చెందిన తల్లి మేక నుంచి పాలు తాగేందుకు యత్నిస్తున్న పిల్ల కూన

కోటేకల్ కొండల్లో..

ఎమ్మిగనూరురూరల్: కోటేకల్ గ్రామ సమీపంలోని కొండల్లో చిరుత పులి సంచరిస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి గడ్డం హనుమంతు అనే రైతుకు చెందిన మేకను చంపి తినింది. శనివారం ఉదయం గ్రామస్తులు ఈ విషయాన్ని గమనించి భయాందోళనకు గురయ్యారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి బంధించాలని కోరుతున్నారు.

ఆటోబోల్తా .. యువకుడి మృతి

మిడుతూరు: ఆటో బోల్తా పడడంతో ఓ యువకుడు మృతిచెందాడు. శుక్రవారం రాత్రి మండల కడుమూరు గ్రామ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ మారుతీశంకర్ తెలిపిన వివరాల మేరకు.. పగిడ్యాల మండలం ఘనపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, శ్యామలమ్మ రెండో కుమారుడు పూసలపాటి విజయ్‌కుమార్(21) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితులు ఎస్. నవీన్, జి. నవీన్‌తో కలిసి శుక్రవారం రాత్రి నందికొట్కూరు నుంచి మాసపేటకు ప్రయాణికులతో వదలడానికి వెళ్లారు. మాసపేట గ్రామంలో ప్రయాణికులను వదిలి తిరిగి వస్తుండగా కడుమూరు గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడింది. ఆటో కింద పూసలపాటి విజయ్ కుమార్ పడి తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరు స్నేహితులకు ఎం . నవీన్, జి. నవీన్‌లకు గాయాలయ్యాయి. కర్నూలు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ప్రయాణికులు 108 కు సమాచారం అందజేశారు. 108లో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే విజయ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతీశంకర్ తెలిపారు.



మృతిచెందిన విజయ్ కుమార్

భక్తుడిపై ఎలుగుబంటి దాడి

ఆళ్లగడ్డ: ఎగువ అహోబిలం సమీపంలోని పావన వెళ్లే దారిలో ఓ భక్తుడిపై ఎలుగు బంటి దాడి చేయడంతో గాయపడ్డాడు. రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన పాములేటి అనే భక్తుడు ఎగువ అహోబిలం నుంచి మెట్ల దారి మీదుగా పావనకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెట్ల పొదల్లో నుంచి వచ్చిన ఎలుగుబంటి అతనిపై దాడి చేసింది. ఎలుగుబంటి నుంచి తప్పించుకున్న పాములేటి ఎగువ అహోబిలం చేరుకోవడంతో స్థానికులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతున్నాడు.



గాయపడిన పాములేటి

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): బాలల సంక్షేమ కమిటీ జ్యువెనల్ జస్టిస్ బోర్డులో ఛైర్మన్, సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమ శాఖ పర్యవేక్షణ అధికారి చెన్నారెడ్డి శనివారం తెలిపారు. నంద్యాల జిల్లాలో ఛైర్‌పర్సన్లు, సభ్యులు, జ్యువైనల్ జస్టిస్ బోర్డులో సోషల్ వర్కర్స్, సభ్యుల కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వారు తెలిపారు. సామాజిక కార్యకర్తగా పని చేయుటకు అర్హులైన, అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 13వ తేదీలోగా విజయవాడలోని శాఖా డైరెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. ఇతర వివరాలకు http://wdcw.ap.gov.inవెబ్‌సైట్, 83283 11369ను సంప్రదించాలన్నారు.

గోరుకల్లు పెండింగ్ పనులకు రూ.90 కోట్లు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: సీమకు తలమానికమైన గోరుకల్లు రిజర్వాయర్ పెండింగ్ పనులకు రూ.90 కోట్లకు ప్రతిపాదనలు పంపగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం పాణ్యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే కాటసాని విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం గోరుకల్లు బండ్, పెండింగ్ పనులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం ఇవ్వగా తక్షణమే స్పందించి నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తామన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టు 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారన్నారు. రాష్ట్రానికి జీవనాడిగా నిలిచే పోలవరం ప్రాజెక్టును కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూర్తి చేసి చరిత్రలో నిలిచిపోతారన్నారు. టీడీపీ హయాంలో సాగునీటి ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేయడంతో రైతులు నష్టపోయారన్నారు. ఇటీవల గోరుకల్లు రిజర్వాయర్ కట్ట కుంగిపోగా అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారని, త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఖరీఫ్ కోసం వరి నార్లు వేసుకునే రైతులకు ప్రధాన కాల్వ నుంచి 200 క్యూసెక్కుల మేర నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆయకట్టు రైతులు నీటిని వృథా చేయకుండా నీటిని ఉపయోగించుకోవాలన్నారు.

